క్లుప్తంగా

కరాటే మాస్టారుకు అవార్డు



పెనమలూరు: కరాటే మాస్టారు ఉప్పాడ బ్రహ్మానందం జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఈ నెల మూడో తేదీన నిర్వహించిన కార్యక్రమంలో భారతీయ స్ఫూర్తి సేవారత్న జాతీయ అవార్డు-2023ను బ్రహ్మానందనకు ప్రదానం చేశారు. షిటోరియో కరాటే అకాడమీ నెలకొల్పి ఎందరో క్రీడాకారులను తీర్చిదిద్ది ఉత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: వదినతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పెనమలూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పోరంకిలో ఓ మహిళ భర్త, ఇద్దరు పిల్లలతో నివసిస్తోంది. ఆమె భర్త హోం గార్డుగా పని చేస్తాడు. ఇటీవల ఆమె ఇంటికి మరిది కిషోర్ వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. అతడి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీదేవిసమీరాకి డాక్టరేట్



పెనమలూరు: మండలంలోని గంగూరులో ఉన్న ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మేకల శ్రీదేవి సమీరాకు డాక్టరేట్ వచ్చింది. ఆమె చేసిన పరిశోధనలకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టరేట్ పొందిన శ్రీదేవిసమీరాను కాలేజీ యాజమాన్యం సహచర అధ్యాపకులు అభినందించారు.

పూజాసామగ్రి సరఫరాకు టెండర్ల ఆహ్వానం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి ఏడాది కాలానికి సంబంధించి పూజాసామగ్రి ఇతర వస్తువులు సరఫరా చేసేందుకు ఆసక్తిగల వ్యక్తుల నుంచి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి బుధవారం తెలిపారు. పూజా సామగ్రి, ప్రసాదం, అన్న ప్రసాదాలకు సరుకులు, శానిటరీ వస్తువులు, అమ్మవారికి నిత్యాలంకరణ, తిరునాళ్లతోపాటు ఆయా పర్వదినాలలో పూల దండలు, విడిపూలు, తమల పాకులు, అమ్మవారికి వస్త్రాలు, శేషవస్త్రాలు సరఫరా చేసే అంశాలకు సంబంధించి ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. టెండర్ దక్కించుకున్నవారు ఈ ఏడాది డిసెంబర్ ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 30వ తేదీ వరకు ఆయా వస్తువులను సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. టెండర్‌దారుల నుంచి పూర్తిచేసిన టెండర్ షెడ్యూళ్లను ఈ నెల ఆరో తేదీ ఉదయం 10.30 గంటల వరకు స్వీకరిస్తామని వివరించారు. అదే రోజు ఉదయం 11 గంటలకు సీల్డ్ కవర్లను తెరిచి టెండర్లు ఖరారు చేస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు ఈ టెండర్లలో పాల్గొనాలని ఆమె కోరారు.

వాలీబాల్ కిట్ అందజేత



గన్నవరం రూరల్: విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో సొంత నిధులతో కొనుగోలు చేసిన వాలీబాల్ కిట్‌ను విద్యార్థులకు బహూకరించారు. క్రీడల్లో పాల్గొనే వారికి శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని వివరించారు. వార్డు సభ్యులు చిట్టినేని కార్తీక్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదుతోపాటు రైతుభరోసా కేంద్రంలో ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జోన్నలగడ్డ భవాని బుధవారం సూచించారు. బాపులపాడు మండలంలో 2023 ఖరీఫ్ సీజన్‌లో 18,282 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, మరో 13,739 ఎకరాలలో ఉద్యాన పంటలు సాగవుతున్నట్లు వివరించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశామని తెలిపారు. ప్రతిరైతు ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంట సాగు వివరాలను ధ్రువీకరిస్తూ రైతు భరోసా కేంద్రంలో ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ రాయితీలు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు పొందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఆమె సూచించారు.

అందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష

పెనమలూరు: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తాడిగడప మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అభినేష్ తెలిపారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కానూరు సచివాలయం-2 పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ అభినేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి వ్యాధులతో ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక వైద్య సేవలందిస్తోందని వివరించారు. ఆయా విభాగాల్లో నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి, మందులు ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. ఈ శిబిరంలో 266 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రవికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాంద్ బాషా, వేమూరి బాలకృష్ణ, నల్లమోతు జీవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావు వైద్య శిబిరాన్ని సందర్శించారు.



కానూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

కంకిపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరం బుధవారం జరిగింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఈడా శివనాగలక్ష్మి ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ సుందర్‌కుమార్, డాక్టర్ సుధా ప్రసూజ, వైద్యులు నిఖిత, నవీన్‌తేజ, ప్రిస్కిల్లా, సంతోష చంద్రిక, కంటి వెలుగు ఆప్తమాలిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ 596 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి బాబు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత సందర్శించి వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఎంపీటీసీ బేతపూడి సురేష్, తహసీల్దార్ పి.ఎస్.వి.ప్రసాద్, ఎంపీడీఓ అనూష, ఆర్‌ఐ వెంకటరమణ, ఎంఈఓ ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు బి.హెచ్.నాగిరెడ్డి, బి.హెచ్.రాజగోపాల్‌రెడ్డి, బి.హెచ్.గిరిరెడ్డి, కట్టుకోలు రవిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా పోషకాలతో కూడిన ఆహార పదార్థాలతో ప్రదర్శన ఏర్పాటుచేశారు.



ప్రొద్దుటూరులో మందులు అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి డాక్టర్ బాబు తదితరులు



సర్వే చేస్తున్న ఏఎన్ఎం మేరీగ్రేస్

ముమ్మరంగా ఆరోగ్య సురక్ష సర్వే

గన్నవరం రూరల్: మండల పరిధిలోని ఆయాగ్రామాల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా కొనసాగింది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి రికార్డులలో నమోదు చేశారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను చేపట్టినట్లు మండల వైద్యాధికారి ఆనంద్‌బాబు తెలిపారు. చనుపల్లివారిగూడెంలో ఏఎన్ఎం మేరీ గ్రేస్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి ఆర్యోగ సమస్యలను అడిగి తెలుసుకుని, ఆయ వివరాలను రికార్డుల్లో నమోదు చేశారు. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రజారోగ్యం సంరక్షించేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్ కోరారు. బాపులపాడు మండలం వేలేరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన, మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా ఇంటింటి సర్వే నిర్వహించి, గ్రామగ్రామాన ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూషా నేతృత్వంలోని వైద్యుల బృందం 571మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యవంతమైన జీవనం సాగించేందుకు అవలంభించాల్సిన ఆహార పద్ధతులు, సమతుల్య పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సాదిమెళ్ల సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు యోహాన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొడాలి సత్యప్రభాకర్, ఉసా జయప్రసాద్, సరిపల్లి కాంతరావు, పొలగాని రాకడరాజు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక

గన్నవరం: హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు గన్నవరం జెడ్పీ బాలురోన్నత పాఠశాల చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులకు బుధవారం అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పెద్దఆవుటపల్లిలో జరిగిన జిల్లాస్థాయి అండర్-16 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆర్.తేజేష్, జి.నాగ బాలాజీ, డి.చందు విశేషప్రతిభను కనబరిచి జిల్లాజట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈ నెల 18వ తేదీ నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాజట్టు తరఫున వీరు పాల్గొంటారని వివరించారు. విద్యార్థులతోపాటు పీఈటీలు ధనియాల నాగరాజు, షేక్ మీరాసాహెబ్‌ను అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ

పేద విద్యార్థికి ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం భోగాపురం గ్రామానికి చెందిన యాళ్ల సాయిదేవికి సివిల్ సర్వీసెస్ ప్రిపరేషన్ నిమిత్తం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని మానవత సంస్థ అందజేసింది. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సాయిదేవికి ఈ మొత్తాన్ని అందజేశారు. మానవత విద్యానిధి ద్వారా రూ.25 వేలు, విశ్రాంత ఎంఈఓ ఘంటా సత్యనారాయణ, ఇందిరాదేవి దంపతులు రూ.24 వేలు, జయలక్ష్మి రూ.వెయ్యి చొప్పున ఆర్థికసాయం అందించినట్లు కోటేశ్వరరావు తెలిపారు. దాతలు అందించిన సహకారంతో మరింత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సాయిదేవికి ఆయన సూచించారు. కార్యక్రమంలో మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, క్లేపల్లి నారాయణరావు, జిల్లా కోశాధికారి వడ్డి రాజేశ్వరరావు, పొట్లూరి శేషాచలం, జన్యావుల సత్యనారాయణ, దయాల ప్రభాకరరావు, నారగాని కొండలరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

జిల్లా హౌసింగ్ పీడీ సూర్యనారాయణ

గుడివాడరూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.సూర్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని శేరీవేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీని హౌసింగ్ అధికారులతో బుధవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణాలు ఎంత వరకు జరిగాయి, ఇంకా ఎంత మంది ప్రారంభించాలనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు తీసుకోవాల్సిన చర్యలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ఐదు లక్షల ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే రూఫ్ లెవెల్ వేసిన లబ్ధిదారులు సెంట్రింగ్, స్లాబ్ పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించి వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పీడీ ఆదేశించారు. సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ సర్పంచ్ మేడేపల్లి ప్రభాకరరావు, హౌసింగ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రామోజీనాయక్, హౌసింగ్ అధికారులు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



శేరీవేల్పూరు జగనన్న కాలనీలో అధికారులకు సూచనలిస్తున్న పీడీ సూర్యనారాయణ

ధన్వంతరి జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య విజ్ఞప్తి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నాయీ బ్రాహ్మణుల కులదైవమైన ధన్వంతరి జయంతి వేడుకలను ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని టీటీడీ పాలకవర్గ సభ్యుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడ గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన బోర్డ్ మీటింగ్‌లో తీర్మానం చేశారు. బోర్డ్ సమావేశంలో ఇప్పటి వరకు చేసిన తీర్మానాలపై సమీక్షించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ పర్సన్ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్, బీసీ కార్పొరేషన్ల కో ఆర్డినేటర్ అగ్రహారం ప్రవీణ్, కార్పొరేషన్ డైరెక్టర్లు నూకరాజు, కాపవరపు శ్రీదేవి, పుల్లయ్య, శ్రీనివాస్, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు యలమంద పాల్గొన్నారు.



నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ బోర్డ్ మీటింగ్‌లో యానాదయ్య తదితరులు

అతిరాస కులస్తులకు క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న అతిరాస కులస్తులందరికీ క్యాస్ట్ సర్టిఫికెట్లు జారీచేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో బుధవారం నిర్వహించిన బోర్డ్ మీటింగ్‌లో ఈ మేరకు తీర్మానం చేశారు. అలాగే అతిరాస కులస్తుల వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు మరో 11 తీర్మానాలను కూడా చేశారు. సమావేశంలో అతిరాస కార్పొరేషన్ ఎండీ చినబాబు, బీసీ కార్పొరేషన్ల కో ఆర్డినేటర్ అగ్రహారం ప్రవీణ్, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.



అతిరాస కార్పొరేషన్ బోర్డ్ మీటింగ్‌లో భాస్కరరావు, తదితరులు

15 నుంచి దసరా ఉత్సవాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొగల్‌రాజపురం సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ గోకరాజు గంగరాజు, వైస్ చైర్మన్ చదలవాడ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఐలాపురం హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 24 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. దసరా అంటే రాష్ట్రంలోనే విజయవాడ ప్రసిద్ధి గాంచిన పండుగ అన్నారు. మైసూర్ నగరాన్ని తలపించే విధంగా దసరా ఉత్సవాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి దీక్షాపరులు, సామాన్య ప్రజలు వేర్వేరుగా అమ్మవారి దర్శనం నేరుగా చేసుకునేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. 15 నుంచి 24 వరకు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారన్నారు. 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మీదేవి, 19న శ్రీ మహాచండీ, 20న సరస్వతీదేవి, 21న లలితా త్రిపుర సుందరీ, 22న దుర్గాదేవి, 23న మహిషాసుర మర్దిని, 24న రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల్లో వేదపండితులు, ఘనాపాటీల పర్యవేక్షణలో శతచండీ మహారుద్ర యాగం, కుంకుమార్చన జరుగుతాయన్నారు. అనంతరం ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ వైట్ల కృష్ణ, చలువాది మల్లికార్జునరావు, కొల్లి హారిక, బి. రాంప్రసాద్‌రెడ్డి, గ్రంథి రామ సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గుడివాడ టౌన్: విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తుందని దానిని సద్వినియోగపర్చాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఆర్జేడీ పి.పద్మావతి అన్నారు. బుధవారం ఆమె బేతవోలు మునిసిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరీక్షించారు. స్వయంగా తిని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుందని, వాటిని విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు, పోలాసి వాసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్ల తొలగింపు

వియవాడరూరల్: అక్రమ లేఅవుట్లపై సీఆర్‌డీఏ అధికారులు కొరడా ఝళిపించారు. విజయవాడ రూరల్ మండలంలోని నున్న, పాతపాడు, అంబాపురం గ్రామాల్లో అక్రమంగా వేసిన లేఅవుట్లను సీఆర్‌డీఏ అధికారులు బుధవారం జేసీబీ మిషన్లు ఏర్పాటు చేసి ధ్వంసం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నున్న, పాతపాడు, అంబాపురం గ్రామాల్లో వేసిన అక్రమలేఅవుట్లను జూనియర్ ప్లానింగ్ అధికారి ప్రభాకర్, సీఆర్‌డీఏ ఏడీఎం మధుసూదనరావు ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. నున్న గ్రామంలో సర్వే నంబర్లు 279/3బీలో 93 సెంట్ల విస్తీర్ణంలో, 698/2బీలో మూడు ఎకరాల 24 సెంట్లలో, 536/6లో 80సెంట్ల విస్తీర్ణంలో, అంబాపురంలో ఆర్ఎస్ నంబరు 36/3లో ఎకరం 17సెంట్ల విస్తీర్ణంలో వేసిన అక్రమలేవుట్లను అధికారులు ధ్వంసం చేసి ఆయా లేఅవుట్ల హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా సీఆర్‌డీఏ ఏడీఎం మధుసూదనరావు మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ లే అవుట్లలో వేసిన ప్లాట్లను, అనుమతులు లేకుండా నిర్మించిన అపార్టుమెంట్లలో గృహాలను కొనుగోలు చేసి నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. అక్రమ లేఅవుట్లు వేస్తే సహించేది లేదని ఆయా లేఅవుట్ల యాజమాన్యాలను హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు తీసుకుని లేఅవుట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. అక్రమ లేఅవుట్ల తొలగింపులో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలేఖ, ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి జి.టి.వి.రమణ, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.



నున్నలో అక్రమ లేఅవుట్లను ధ్వంసం చేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

గన్నవరం: ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. స్థానిక గ్రామసచివాలయం పరిధిలోని రోటరీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన సందర్శించారు. తొలుత క్యాంపును ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, సర్పంచి నిడమర్తి సౌజన్య ప్రారంభించారు. వైద్యులు మొత్తం 437 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. మెడికల్ క్యాంపును పర్యవేక్షించిన లక్ష్మీశ, పేదలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈసందర్భంగా లక్ష్మీశ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలను గుర్తించినట్లు చెప్పారు. వీరికి మెడికల్ క్యాంపులలో పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న సురక్ష క్యాంపులను విజయవంతం చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, జలసూత్రం రామ్మోహన్‌రావు, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి సుబ్బారావు, ఎంపీడీఓ ఇ. సత్యకుమార్, వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు, డీటీ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కిట్ అందజేస్తున్న లక్ష్మీశ, ప్రజాప్రతినిధులు

ఉషారామాలో వర్క్‌షాపు నిర్వహణ

రాస్‌బెర్రిపై శిక్షణ తరగతులు

ఉంగుటూరు: తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం మూడో సంవత్సర విద్యార్థులకు రాస్‌బెర్రిపై ఆరు రోజుల వర్క్‌షాపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవాడ ఎస్ఆర్‌సీఈ సొల్యూషన్ ఆర్ అండ్ డీ ఇంజినీర్ సి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్‌బెర్రి విశిష్టత, దానికి అనుసంధానమైన డిజైన్స్ ప్రోగ్రామింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్ షాప్ నిర్వహణతో విద్యార్థులకు సర్క్యూట్ డిజైన్, సిమ్యులేషన్ అంశాలపై అవగాహన పెరిగి, ప్రాజెక్టు రూపకల్పనలో వారికి ఎంతోగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.రాజశేఖర్, ప్రిన్సిపాల్ ప్రసాద్, డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి

సుధారాణికి ఉత్తమ వ్యవసాయ శాస్త్రవేత్త అవార్డు

కంకిపాడు: ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణికి జాతీయ స్థాయిలో 2023 సంవత్సరానికి గానూ ఉత్తమ వ్యవసాయ శాస్త్రవేత్త అవార్డు లభించింది. డాక్టర్ బి.వసంతరాజ్ డేవిడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో ఐదో జాతీయ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్న వారిని గుర్తించి డాక్టర్ బి.వసంతరాజ్ డేవిడ్ ఫౌండేషన్ అవార్డులను ప్రదానం చేసింది. ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానంలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ డి.సుధారాణి ఈ ఏడాది వ్యవసాయశాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పంటలను ఆశించే కీటకాల నివారణ, ఎరువుల యాజమాన్యం, రైతులకు సాగు పద్ధతులపై కల్పిస్తున్న అవగాహనా కార్యక్రమాలకు గానూ ఉత్తమ వ్యవసాయశాస్త్రవేత్త అవార్డు దక్కిందన్నారు. చెరకు పంటను ఆశించే చెదల నివారణ, యాజమాన్యంపై సెమినార్‌లో తన ప్రజెంటేషన్ ఉత్తమ ప్రజెంటేషన్‌గా ఎంపికైందని తెలిపారు. ఫౌండేషన్ ట్రస్టీ, కార్యదర్శి, కోశాధికారి డాక్టర్ బి.వసంతరాజ్ డేవిడ్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసలు అందుకోవటం సంతోషంగా ఉందన్నారు.



డాక్టర్ బి.వసంతరాజ్ డేవిడ్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ డి.సుధారాణి